తున్నది. నోరులేని పాత వాషింగ్ మెషిన్ లోడ్ ఎక్కువై మొరాయిస్తున్నది. కొత్త గీజర్ అవసరాన్ని పిల్లలు నొక్కి చెబుతున్నారు. కరెంటు బిల్లు మూడురెట్లు పెరిగింది. నెలాఖరులో చేబదుళ్లు తప్పనిసరి అయిపోతున్నాయి. ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు మారాల్సిన అనివార్య పరిస్థితిలో చిక్కుకున్నాడు ఇలియాస్.

**పెద్దల కష్టాలు..**

కరోనా రాక్షసి మధ్యతరగతి జీవితాల్ని రాచి రంపాన పెట్టింది. ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి. ఉద్యోగాలు ఎగిరిపోయాయి. ఖర్చులు పెరిగిపోయాయి. ప్రాణభయాలు అధికం అయ్యాయి. వయోధికుల ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతింది. పల్లెలో అయినా సరే ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం లేదు. పిల్లల తోడు అనివార్యమని భావిస్తున్నారు. ఇరుకిరుకు జీవితమని తెలిసినా పట్టణాలకు ప్రయాణం అవుతున్నారు. భారమవుతున్నామని తెలుస్తున్నా, కొడుకూకోడళ్ల మొహాల్లో రంగులు మారుతున్న దృశ్యం స్పష్టంగా కన్పిస్తున్నా.. గమనించనట్టే ఉంటున్నారు. దిక్కులేని చావులు చూసిన చేదు అనుభవాలు ఆ ముసలి గుండెల్ని రాటుదేలేలా చేస్తున్నాయి. 'కన్నాం. పెంచాం. చదువులు చెప్పించాం. ప్రయోజకుల్ని చేశాం. చివరి రోజుల్లో నాలుగు ముద్దలు వేయలేరా?' అనే మొండిధైర్యం. నిజమే, వాళ్లకు మాత్రం ఈ కాంక్రీట్ జంగిల్ నచ్చుతుందా? ఈ ప్లాస్టిక్ పలకరింపులు ఇష్టం అవుతాయా? ఓ అనివార్యత నగరాల వైపు నడిపిస్తున్నది. ఆ మాటకొస్తే .. గ్రామాల్లోనూ శాండ్‌విచ్ జనరేషన్స్ చాలానే కనిపిస్తాయి. కాకపోతే, నగరాలతో పోలిస్తే.. మూడుతరాల మధ్య మరీ ఎక్కువ అగాధం ఉండదు. ఆస్తిపాస్తులు ఇంకా పెద్దల పేరు మీదనే ఉండటం దీనికి ఓ కారణం కావచ్చు.

**పిల్లల గొణుగుడు..**

అప్పటిదాకా ఆ ఇంట్లో పిల్లలదే రాజ్యం. ఏ బ్రాండ్ టీవీ కొనాలో వాళ్లే నిర్ణయించేవారు. ఏ మాడల్ రిఫ్రిజిరేటర్ ఆర్డరు చేయాలన్నదీ వాళ్లే తీర్మానించేవారు. బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్ వరకు మెనూకు ఆమోద ముద్ర వేసేదీ వాళ్లే. ఫ్రెండ్స్ కోసం ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి. ఏ బర్త్‌డే పార్టీకో వెళ్లి అర్ధరాత్రి తిరిగొచ్చినా అమ్మ అడ్డు చెప్పదు. పాకెట్ మనీ కోసం డిమాండ్ చేయొచ్చు. అయినా, దిగిరాకపోతే అలిగి అన్నం మానేసి ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేయొచ్చు. ఇదంతా సీనియర్ తరం రంగప్రవేశం చేసేవరకే. ఆ తర్వాత సీన్ మారుతుంది. ఆలస్యంగా వస్తే ప్రశ్నిస్తారు. డ్రెస్సింగ్‌లో తేడా ఉంటే హెచ్చరిస్తారు. మొండికేస్తే మొహంవాచేలా తిడతారు. 'మా రోజుల్లో అయితేనా?' అంటూ ఫ్లాష్ బ్యాకులు వినిపిస్తారు. సెల్‌ఫోన్ కబుర్లు హద్దులు దాటినా.. చాటింగ్‌లో అర్ధరాత్రి గడిచిపోయినా పొద్దున్నే క్లాసు. 'ఇదేం పెంపకం?' అంటూ అమ్మానాన్నలకు వాయింపు. క్రమంగా పెద్ద తరానికి, చిన్న తరానికి మధ్య గొడవలు మొదలవుతాయి. ఆధిపత్యపోరు అధికం అవుతుంది. ఎవరివైపు నిలబడాలో అర్థంకాక శాండ్‌విచ్ తరం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుంది. అది అసాధ్యమని అర్థమైపోయాక.. మౌనాన్ని ఆశ్రయిస్తుంది. 'నా కొడుకు మునుపట్లా లేడు' అని కన్నీళ్లు పెట్టుకుంటారు పెద్దలు. 'డాడీకి మేమంటే ఇష్టం లేదు' అని ఏడుపు లంకించుకుంటారు పిల్లలు. కుటుంబం నిట్టనిలువునా చీలిపోతుంది. పిల్లలకేమో అమ్మానాన్నలతో కలిసి సినిమాకు వెళ్లాలనే కోరిక. ఆ నాన్న తన అమ్మానాన్నల్ని కూడా బయల్దేరమంటాడు. దీంతో పిల్లలు నిరాశకు గురవుతారు. నాన్న డాక్టర్ అపాయింట్‌మెంట్, కూతురు కూచిపూడి నృత్య ప్రదర్శన ఒకే సమయంలో ఉన్నప్పుడు.. సహజంగానే డాక్టర్ అపాయింట్‌మెంట్ వైపే మొగ్గు చూపాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో సీనియర్-జూనియర్ తరాల మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చాల్సిన బాధ్యత కూడా శాండ్‌విచ్ జనరేషన్‌దే.

**ఒత్తిడి.. ఒత్తిడి**

శాండ్‌విచ్ తరంలోని భార్యాభర్తలు ఇద్దరిలో తొలి దెబ్బ భర్తమీదే పడుతుంది. అనుకోని ఖర్చులు కంటి మీద కునుకు లేకుండా చేస్తాయి. ఇలాంటి సమయంలో మూడు తరాలకూ మూడు ఆర్థిక ప్రణాళికలు అవసరమని సలహా ఇస్తారు పర్సనల్ ఫైనాన్స్ నిపుణులు. సీనియర్ జనరేషన్‌ను తీసుకుందాం. అప్పటికే వారికున్న స్థిరచరాస్తులను బేరీజు వేసి.. జీవితకాలానికి సరిపడా స్థిరాదాయాన్ని సమకూర్చే ఏర్పాట్లు చేయాలి. ఊళ్లో నిరుపయోగంగా ఉన్న ఇంటిని అమ్మకానికి పెట్టి.. ఆ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. నెలనెలా వడ్డీ డబ్బు చేతికొస్తే.. ఏ మందుల ఖర్చుకో పనికొస్తుంది. ఇల్లు, ఫ్లాట్ మొదలైనవాటి మీద బ్యాంకులు రివర్స్ మార్ట్‌గేజ్ రూపంలో రుణాలు ఇస్తున్నాయి. ఊళ్లో పొలానికి వచ్చే కౌలు డబ్బును అన్నదమ్ములు పంచేసుకోకుండా.. పెద్దలకే అందేలా ఓ ఒప్పందం చేసుకోవచ్చు. పెద్దల ఖర్చుల విషయంలో తోబుట్టువుల సహకారం తీసుకోవచ్చు. ఎంతోకొంత బాధ్యత తీసుకునేలా ఒత్తిడి చేయవచ్చు. ఎడ్యుకేషన్ లోన్ తీసుకోవడం ద్వారా.. పిల్లల ఫీజుల భారాన్ని దించుకోవచ్చు. దీనివల్ల పిల్లలకూ బాధ్యత తెలుస్తుంది. పాకెట్ మనీ విషయంలోనూ కచ్చితమైన నిర్ణయం తీసుకోవాల్సిందే. పెరిగిన ఖర్చుల కారణంగా ఆ మొత్తానికి కోత విధిస్తున్నట్టు కరాఖండీగా చెప్పేయవచ్చు. వాళ్లూ అర్థం చేసుకోగలరు. అదే సమయంలో సొంత ఆర్థిక ప్రణాళిక కూడా అవసరమే. ఎమర్జెన్సీ ఫండ్, రిటైర్మెంట్ నిధి.. తదితర ఏర్పాట్లు చేసుకోవాలి. అంతేకానీ, శక్తికి మించిన అప్పులు చేయడం, ఆ అప్పులు తీర్చడానికి మరిన్ని అప్పులు చేయడం.. అంతిమంగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడమే. శాండ్‌విచ్ జనరేషన్‌కు ఏ కష్టం వచ్చినా.. అది పాత, కొత్త తరాలు రెండిటిని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. శాండ్‌విచ్ జనరేషన్లు పెరగడానికి ప్రధాన కారణం.. సుదీర్ఘ జీవన ప్రమాణాలు, ఆధునిక వైద్య విధానాలు' అని విశ్లేషిస్తారు సైకాలజిస్టులు. కాబట్టే, ముప్పై అయిదు నుంచి యాభైనాలుగేండ్ల తరంలో నలభైశాతం మంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఆ ఒత్తిడికి కారణం చాలా సందర్భాల్లో కెరీర్ కాదు.. సాక్షాత్తు కుటుంబ బాధ్యతలే. ■

## అంకెల్లో ఆమె శ్రమ

**శాండ్‌విచ్ జనరేషన్‌లో భర్తకు రెట్టింపు ఒత్తిడిని ఆమె భరిస్తుంది. పదిరెట్ల పని ఎక్కువ చేస్తుంది. మిగిలిన మహిళలతో పోలిస్తే శాండ్‌విచ్ ఇల్లాలు..**

- రోజూ నాలుగు గంటల సమయం అదనంగా కుటుంబానికి కేటాయిస్తుంది.
- ఆఫీసులో ఓ గంట తక్కువే పనిచేస్తుంది.
- రెండు గంటల నిద్రను త్యాగం చేస్తుంది.
- పదేళ్ల ముందుగానే అధికరక్తపోటు, మధుమేహం తదితర జీవనశైలి వ్యాధులు చుట్టుముడతాయి.
- స్నేహితులూ తక్కువే. విందులు, వినోదాలకు హాజరు కూడా అంతంతమాత్రమే.
- జీవితభాగస్వామితో గొడవలకు ఆస్కారం అధికం.

